# గ్రంథాలయం.. గందరగోళం

- ఇరుకు భవనంలో నిర్వహణ
- నిత్యం ట్రాఫిక్ రణగొణ ధ్వనులు
- ఏకాగ్రతతో చదవలేకపోతున్న పాఠకులు
- లైబ్రరీకి పక్కా భవన నిర్మాణం కలేనా..?




అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

**పుట్టపర్తి టౌన్:** అసలే ఇరుకు భవనం.. ఆపై రణగొణ ధ్వనులు .. ఇదీ గ్రంథాలయంలోని గందరగోళ పరిస్థితి. పాఠకులకు ప్రశాంతత కరువైంది. ఏకాగ్రతతో పుస్తక పఠనం చేయలేకపోతున్నారు. ఇది ఎక్కడో కాదు జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని దుస్థితి. 1985లో గ్రేడ్–2 శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వాటర్ ట్యాంకు కింద ఉన్న రెండో అంతస్తులోని ఇరుకు గదుల్లో నిర్వహించారు. పాఠకుల ఇబ్బందుల దృష్ట్యా రెండు సంవత్సరాల కిందట వేణుగోపాలస్వామి ఆలయం వద్ద అద్దె భవనంలోకి మార్చారు. మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదు. ప్రస్తుతం పట్టణ జనాభా 50 వేల మంది దాకా **ఉన్నారు. అంతేకాదు దేశవిదేశాల నుంచి సత్య**సాయి భక్తులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. అంతటి రద్దీ కలిగిన ఈ ప్రాంతంలోని గ్రంథాలయంలో దిన, వార, పక్ష, మాస పత్రికలతో **పాటు నవలలు, వివిధ రకాల పుస్తకాలు, పోటీ** పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తగినన్ని గదులు లేనందున విలువైన పుస్తకాలు అటకెక్కాయి. అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పుస్తకాల నిర్వహణ, శుభ్రత సరిగా ఉండడం లేదు. పది మంది కూర్చుని పత్రికలు లేదా పుస్తకాలు చదివే పరిస్థితి లేదు. ప్రధాన రహదారి మీదుగా వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో విపరీతమైన శబ్దాలు వస్తుంటాయి. ఈ ఇబ్బందుల నుంచి బయటపడాలంటే కాస్త విశాలమైన భవనం కావాలి. అయితే ప్రభుత్వం చెల్లించే రూ.6వేల అద్దెకు ఆ స్థాయి సౌకర్యాలు కలిగిన భవనం దొరకడం లేదు. ప్రశాంత వాతావరణంలో తగినన్ని గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కలిగిన భవనం కావాలంటే కనీసం రూ.15వేలు అద్దె వెచ్చించాల్సి వస్తుందని పలువురు చెబు తున్నారు. లేదా పక్కా భవనం నిర్మిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పాఠకులు పేర్కొంటున్నారు. అయితే ఐదు సెంట్ల స్థలం కేటాయించడంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### చదివేందుకు ఇబ్బంది



ఇరుకైన అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ రణగొణ ధ్వనుల మధ్య ప్రశాంతంగా చదవలేకపోతున్నాం. ఏకాగ్రతతో చదువుకోవాలంటే గ్రంథాలయ భవనం విశాలంగా ఉండాలి. ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

– మనోహర్, డీఎస్సీ అభ్యర్థి, పుట్టపర్తి

### పక్కా భవనం నిర్మించాలి



పుట్టపర్తికి దేశవిదేశాల నుంచి ఎంతోమంది భక్తులు వస్తుంటారు. ఇక్కడ లైబ్రరీ ఎక్కడ ఉందో గుర్తించడం కష్టమే. పాఠకులందరికీ చదువుకోవడానికి విశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో పక్కా భవనం నిర్మించి.. అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

– తలమర్ల సంజీవరెడ్డి, పుట్టపర్తి

### అనువైన స్థలం కేటాయించాలి



గ్రంథాలయానికి పక్కాభవనం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ దష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. గతంలో ఆర్టీసీ డిపో దగ్గర స్థలాన్ని పరిశీలించారు. మాకు అధికారికంగా అనువైన స్థలం కేటాయిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రంథాలయ భవనం ఏర్పాటుకు చర్యలు చేపతాం.

– జయసింహరాజు, గ్రంథాలయ అధికారి, పుట్టపర్తి

## క్లుప్తంగా

### రమణ మహర్షికి పూజలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న రమణ మహర్షి ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అరుణాచల శివ నామస్మరణతో భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం చేపట్టారు. మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. ఆశ్రమ నిర్వాహకుడు చిప్పల వెంకప్ప భక్తులకు అన్నదానం చేశారు.

### కల్యాణం.. కమనీయం



లక్ష్మీచెన్నకేశవ స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటేశులు, అడ్‌హక్ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్ సమక్షంలో అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాష్ తదితరులు చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో స్వామికి కల్యాణం జరిపించారు. అలాగే మహాలక్ష్మి జయంతి సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

### లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



అలంకరణలో లక్ష్మీనరసింహుడు

**పుట్టపర్తి టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి, ఎనుములపల్లి గ్రామాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన చేపట్టారు. స్వామిని వివిధ పూలతో అలంకరించి మంగళహారతి ఇచ్చారు. ఉదయం 11 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామికి కల్యాణం జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### అన్ని రంగాల్లో రాణించాలి



కేక్ కట్ చేస్తున్న మహిళలు

**తలుపుల:** మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు.

### కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని చిప్పలమడుగు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం దాడి చేశారు. 2 కోళ్లు, రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

### చీనీ, మామిడి చెట్లకు నిప్పు



కాలిపోయిన చీనీ చెట్లు

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో రైతు ఆవుటాల ఓబిరెడ్డికి చెందిన చీనీ, మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. గ్రామం సమీపంలో హంద్రీ–నీవా కాలువపై కంప చెట్లు, గడ్డి అధికంగా ఉండటంతో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టాడు. సమీపంలోని ఓబిరెడ్డికి చెందిన చీనీ, మామిడి తోటలకు మంటలు వ్యాపించాయి. రైతు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ఈ ఘటనలో 80 చీనీ చెట్లు, 10 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

## ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి



కదిరి టౌన్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు




ధర్మవరం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

**ధర్మవరం:** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్ అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాష మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు సంబంధించిన కాంట్రాక్టర్ల అప్పులను తీర్చడానికి మాత్రమే బడ్జెట్ కేటాయించిందన్నారు. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాల బకాయిలను చెల్లించడం కోసం, పరిశ్రమకు అవసరమైన ముడి సరుకులు కొనడానికి ఆ నిధులను వినియోగించకూడదని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం పరిశ్రమను కాపాడటం కోసం చర్యలు చేపట్టకుండా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముడి సరుకులు కొనడానికి కావాల్సిన బడ్జెట్‌ను కేటాయించి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, ముకుంద, కేశవ, ఈశ్వరయ్య, అంగన్‌వాడీ లీడర్లు దీన, పోతక్క, సునీత, పాఠశాల ఆయాల సంఘాల నాయకురాళ్లు చౌడమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్:** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విశాఖకు సొంత గనులు కేటాయించాలని కోరారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించాలని తెలిపారు. రెండు సంవత్సరాలుగా ఫ్యాక్టరీ ముందు కార్మికులందరూ కలిసి పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కడపలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు జగన్మోహన్, ముస్తాక్, బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా లంకా దహనం



అలంకరణలో కాటి కోటేశ్వరుడి ప్రభ

**బత్తలపల్లి:** సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లంకా దహనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈదుల ముష్టూరు నుంచి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ప్రభను ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. లంకా దహనాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. అదేవిధంగా క్షేత్రంలోని మహంకాళీమాత ఆలయంలో గోపూజ నిర్వహించి, హిందు ధర్మప్రచారంపై వివరించారు. సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, ముష్టూరు, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాలకు చెందిన పలువురు భక్తులు ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని క్షేత్రానికి వచ్చారు. కార్యక్రమంలో ముష్టూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి , స్థానికులు ఓబిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సాయి సింహారెడ్డి, రాజసింహారెడ్డి, మల్లికార్జునరెడ్డి, దేవేంద్ర రెడ్డి, ఆనందరెడ్డి, గంగాధరరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి, నల్లపరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, శంకరరెడ్డి, చిట్టిబాల మనోహర రెడ్డి, కుమ్మర శ్రీరాములు, సీపీఐ నాయకులు కమతం కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా రాతిదూలం పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**కనగానపల్లి:** మండల పరిధిలోని పాతపాళ్యం గ్రామంలో శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా జరిగాయి. గ్రామంలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పులేటిపల్లి భాస్కరరెడ్డి, నంద్యాల హరినాథరెడ్డి ఎద్దులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

### మహాధర్నాకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**నల్లమాడ:** పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 17న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల నాయకుడు గోవిందు తెలిపారు. శుక్రవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంచాయతీ కార్మికులతో కలసి విడుదల చేశారు. మహాధర్నాలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నరసింహులు, గంగాధర, శ్రీరాములు, నాగలక్ష్మి, గాయిత్రి, గంగాదేవి, గంగులమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

**వేతనాలు విడుదల చేయాలి**

**ముదిగుబ్బ:** గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్ల సాధనకు ఈనెల 17న చేపట్టిన చలో విజయవాడ (మహాధర్నా) కార్యక్రమానికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులతో కలిసి చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఆలస్యమైన వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేశ్, నాయకులు పోతులయ్య, బాబ్‌జాన్, రహీం, పక్కీరప్ప, వెంగముని, ఓబులేసు, సావిత్రి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### అడవి పందుల బెడద



నల్లచెరువు వద్ద అడవి పందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న

**నల్లచెరువు:** పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు అల్లాడుతుంటే.. మరోవైపు అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తుండటంతో మరింత నష్టపోతున్నారు. రాత్రి సమయాల్లో గుంపులుగా వస్తున్న అడవి పందులు మొక్కజొన్న, వేరుశనగ పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కొందరు రైతులు పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఇనుప తీగలు, చీరలను పంట పొలం చుట్టూ కంచెగా ఏర్పాటు చేస్తున్నారు. పగలంతా పొలంలో పని చేసి మళ్లీ రాత్రిళ్లు పంటను కాపాడుకునేందుకు పొలం వద్దకు కాపలా వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



ఉప్పార్లపల్లి వద్ద కూరగాయల పంట చుట్టూ చీరలు కట్టిన దృశ్యం



సత్యసాయి చాలీసా పఠిస్తున్న భక్తులు



నృత్యం చేస్తున్న జార్ఖండ్ భక్తులు

## హోలీ సంబరాలు

**ప్రశాంతి నిలయం/పుట్టపర్తి రూరల్/బత్తలపల్లి/తాడిమర్రి/కదిరిటౌన్/ధర్మవరం అర్బన్/పుట్టపర్తి టౌన్:** ప్రశాంతి నిలయంలో శుక్రవారం హోలీ సంబరాలు కనుల పండువగా జరిగాయి. బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల భక్తులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి చాలీసా శ్లోకాలను పఠించారు. సాయంత్రం ఇరు రాష్ట్రాల బాలవికాస్ విద్యార్థులు సాయి రంగోత్సవ్ పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి బోధనలను వివరిస్తూ హోలీ పర్వదిన విశిష్టతను చాటుతూ నిర్వహించిన నృత్యరూపకం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అలాగే రత్నాకర్, హిమవాహిని దంపతుల ఇంట్లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. హోలీ విశిష్టతను చాటి చెబుతూ ఒకరినొకరు రంగుల చల్లుకున్నారు. యావత్ ప్రపంచ మానవాళికి సత్యసాయి బాబా ఆశీస్సులు ఉండాలని రత్నాకర్ దంపతులు ఆకాంక్షించారు. ఇక ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. యువతీ, యువకులు వీధుల్లోకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. వీధుల్లో ఉత్సాహంగా తిరుగుతూ సందడి చేశారు.

**సందడిగా హోలీ**

**చెన్నేకొత్తపల్లి:** మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యంగా గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, మేకేనాయక్ తదితర ప్రాంతాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు.



హోలీ వేడుకల్లో రత్నాకర్



చెన్నేకొత్తపల్లిలో రంగులు చల్లుకుంటున్న బాలబాలికలు



'సాయి రంగోత్సవ్'లో ఓ ఘట్టం



ధర్మవరం అర్బన్: శారదానగర్‌లో రంగులు చల్లుకుని హోలీ జరుపుకుంటున్న ప్రజలు

### నేటి నుంచి ఒంటిపూట బడులు

**బత్తలపల్లి/ముదిగుబ్బ:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తామని ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్, రమణప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం ఆ పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

### పరామర్శ

**పుట్టపర్తి:** బుక్కపట్నానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మాల్యవంతం మారుతి మాతృమూర్తి లక్ష్మమ్మ (86) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి తదితరులు శుక్రవారం లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### నేడు మంత్రి పర్యటన

**బత్తలపల్లి:** వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం మండలంలో పర్యటించనున్నారు. బత్తలపల్లిలో కొత్తగా నిర్మించిన బీసీ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తారని బీజేపీ నాయకులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**తనకల్లు:** మండలంలోని చీకటిమానిపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతి చెందాడు. గ్రామంలోని ఎరువుల ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**IN THE COURT OF THE PRL CIVIL JUDGE & J.M.F.C AT PAVAGADA**

**O.S. No. 41/2018**

Plaintiff: Narasimhappa S/o Gangadharappa, Aged about 55 years, R/at Gumghatta Village, Kasaba Hobli, Pavagada Taluk.

-Vs-

Defendants : Adinarayanappa & Ors.

NOTICE TO LR'S OF DEFENDANT No. 2(a) to (c)

a) Smt. Susheelamma W/o Late K.Shiva Prakash, aged about 50 years,
b) Manjuvani D/o Late K. Shiva Prakash, aged about 32 years,
c) Harini D/o Late K. Shiva Prakash, aged about 24 years,

All are redsiding at Joganakunte Cross, Sai Nagar, Beside R.T.C. Bus Stand, Bangalore Road, Dharmavaram Town, Ananthapuram Dist., A.P. State.

**DRAFT PAPER PUBLICATION**

WHEREAS in the above case the plaintiff had filed the above suit against the defendants for specific performance of contract under the agreement of sale dated 09-02-2015 and for Such other reliefs with respect to suit schedule property.

The above said case is posted for appearance of Lr's of defendant No.2(a) to (c) hereby directed to appear before this Hon'ble court on **24-04-2025 at 11.00 A.M.** in person or through counsel, through an authorized agent, failing which the Case will be determined as per law.

**Given under my hand and seal of the court on this 12-03-2025 at Pavagada.**

**By order of the Court**

| | |
|---|---|
| Advocate for plaintiff Murali Krishna (JMM) Advocate, SPG Associate, 1st Floor, 3rd Cross, M.G. Road, Pavagada. | Chief Ministerial Officer Pri Civil Judge and JMFC at Pavagada. |